
ప్రజాశక్తి
మంగళవారం 17 సెప్టెంబర్ 2024
5
పార్వతీపురం మన్యం



నేడు విశ్వకర్మ జయంతి

ప్రజాశక్తి - పార్వతీపురం

విశ్వకర్మ జయంతోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందని ఆయన చెప్పారు. జిల్లా అధికారులు, బిసి సంఘ నాయకులు "విశ్వకర్మ జయంతి " ఉత్సవంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.



గుంకలాం లేఅవుట్‌లో వివిధ స్థాయిల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు

ఇళ్లు లేని పేదల పరిస్థితి ముందుకు వెళ్తే గొయ్యి, వెనక్కి వెళ్తే నుయ్యి అన్న చందంగా ఉంది. ప్రభుత్వం చెల్లించిన అత్తెసరు డబ్బుతో ఇళ్లు నిర్మించుకోలేకపోతున్నారు. అలాగని ఎలాగోలా పూర్తిచేద్దామని ముందుకు వెళ్దామనుకుంటే ప్రభుత్వం ఇస్తున్న మొత్తానికి పది రెట్లు డబ్బు ఉంటే తప్ప ఇల్లు నిర్మించుకోలేని పరిస్థితి. పరిస్థితి ఇలా ఉంటే, ఈ ఏడాది డిసెంబర్‌కు నిర్మాణ పనులు పూర్తిచేసుకోలేకపోతే, ఆ తరువాత బిల్లులు వచ్చే పరిస్థితి లేదని, డిసెంబర్ 31 నాటితో కేంద్ర ప్రభుత్వ హౌసింగ్ ప్రాజెక్టు పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. దీంతో దశాబ్దాల తరబడి సొంతింటి కోసం ఎదురు చూస్తున్న పేదల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది.

డిసెంబరు లోగా పూర్తిచేయకుంటే

ఇళ్ల బిల్లులకు చిల్లే!

రూ.1.80 లక్షలతో ఇల్లు కట్టుకోలేకపోతున్న పేదలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గత ప్రభుత్వం పేదలందరికీ ఇళ్ల స్థలాలతోపాటు ఇళ్లు కూడా మంజూరు చేస్తామని చెప్పిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఇళ్లు లేని సుమారు 1.30 లక్షల కుటుంబాలను అప్పట్లో గుర్తించారు. వీరందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసేందుకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 1830.82 ఎకరాలను అప్పటి వైసిపి ప్రభుత్వం సమీకరించింది. ఇందులో ప్రభుత్వ భూమి 1140 ఎకరాలు కాగా, ప్రయివేటు భూమి 690.82 ఎకరాల వరకు ఉంది. ప్రయివేటు భూమి సేకరణకు సుమారు రూ.300 కోట్లు ఖర్చుచేశారు. ఈ రకంగా సేకరించిన భూముల్లో 1164 లేఅవుట్లు అభివృద్ధి చేశారు. వీటిలో గుంకలాం లేవుట్ 12,301 ప్లాట్లతో రాష్ట్రంలోనే అతిపెద్దదిగా పేరు గాంచింది. లేఅవుట్ల రూపకల్పనతోపాటు బోర్లు, రక్షిత తాగునీటి ట్యాంకులు, రహదారుల నిర్మాణం, విద్యుత్తు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కూడా రూ.వందల కోట్లు ఖర్చు చేసినట్టు ప్రభుత్వ లెక్కలు చూపుతున్నాయి. ఇంటి నిర్మాణానికి ప్రతి లబ్ధిదారుడికీ రూ.1.80 లక్షలు మాత్రమే ఇస్తామని ప్రకటించారు. లబ్ధిదారులు తామే సొంతంగా నిర్మించుకుంటే వారికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేస్తామని, లేదంటే ఇంటి నిర్మాణ సామగ్రి రూపంలో ప్రభుత్వ సహాయం కోరుకుంటే ఆ విధంగా సామగ్రి అందజేస్తామని తెలిపారు. ఈ పనులూ చేసుకోలేని వారికి ఏకంగా ఇళ్లు నిర్మించి, ఇంటిముందు ముగ్గు వేసి తాళం చెవి అప్పగిస్తామని కూడా అప్పటి జగన్ ప్రభుత్వం ప్రగల్భాలు పలికింది. అయితే, ఆచరణలో లక్ష్యానికి అనుగుణంగా నిర్మాణాలు జరగలేదు. ప్రభుత్వ విధానాలే ఇందుకు కారణం.

పెరిగిన ఇనుము, సిమెంట్, ఇటుకలు తదితర గృహ నిర్మాణ వస్తు సామగ్రి వల్ల ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1.80 లక్షలతో చాలామంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేకపోయారు. విజయనగరం జిల్లాలో మంజూరైన 78,805 ఇళ్లకు గాను పూర్తి స్థాయిలో నిర్మించినవి కేవలం 43,192 మాత్రమే. పునాదులు పూర్తికాకుండానే 10,392 ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. ఇందులో 2,340 ఇళ్లకు మాత్రమే రూ.5 వేల చొప్పున బిల్లులు చేశారు. 8051 ఇళ్లకు ఇప్పటికీ చెల్లింపులు లేవు. పునాదుల స్థాయిలో 10,444, లింటల్ లెవెల్‌లో 1,361 ఉండిపోయాయి. స్లాబ్ లెవెల్ గోడలతో 2,873, నిర్మాణాలు పూర్తయినవి 1820 ఉన్నాయి. 2,980 ఇళ్ల పనులు ఇంకా ప్రారంభానికి కూడా నోచుకోలేదు. చేపట్టిన మొత్తం ఇళ్లన్నింటికీ కలిపి ఇప్పటి వరకు రూ.879.50 కోట్ల మేర బిల్లులు చెల్లించినట్టు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పూర్తయిన వాటికన్నా వివిధ దశల్లో నిలిచిపోయినవే అధికంగా ఉన్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ సాయంతో కట్టుకుందామనుకున్నవారు ముందుకు సాగలేకపోయారు. పూర్తిగా ప్రభుత్వ నిర్మాణాలపై ఆధారపడినవారు తీవ్ర అన్యాయానికి గురయ్యారు. ప్రభుత్వ సాయం సరిపోక కొంతమంది నిర్మాణం చేపట్టలేకపోగా, కాంట్రాక్టర్లు నిర్మాణ పనులు మధ్యలో నిలిపేయడంతో మిగిలినవారు నష్టపోతున్నారు. మరోవైపు ఈ ఏడాది డిసెంబర్‌లోపు నిర్మించుకోకపోతే ప్రభుత్వం నుంచి ఆ కొద్దిపాటి బిల్లులు కూడా వచ్చే పరిస్థితి లేదని అధికారులు చెబుతుండటంతో లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది.

నిర్మాణాలు వేగవంతం చేస్తున్నాం

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేస్తున్నాం. మాకు ఎదురౌతున్న సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తున్నాం. ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఇళ్లకు సంబంధించిన ప్రాజెక్టు పూర్తికానున్న నేపథ్యంలో నిర్మాణాలు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం తగిన ఆదేశాలు జారీచేసింది.

- వి.శ్రీనివాస్, గృహ నిర్మాణ శాఖ అధికారి, విజయనగరం జిల్లా

మసకబారుతున్న గిరిజన ప్రతిభా పాఠశాల



- క్వార్టర్స్ ఖాళీ చేయని ప్రిన్సిపల్
- బదిలీపై వెళ్లినా జోగింపేటలో తిష్ట
- మళ్లీ డెప్యుటేషన్ పై రావడానికి పైరవీలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఉన్న ఏకైక గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాల, కళాశాల ప్రతిష్ట మసకబారుతోంది. ఈ పాఠశాల, కళాశాలలో నియామకాలు గానీ, బదిలీలు గానీ ఉపాధ్యాయుల ప్రతిభ ఆధారంగా జరగాలనే నిబంధనలు పక్కదారి పడుతున్నాయి. గిరిజన విద్యార్థులకు నీట్, ఐఐటి, జెఇఇ మెయిన్స్ వంటి పరీక్షలకు శిక్షణ ఇచ్చి ర్యాంకులు సాధించే దిశగా అడుగులు వేయాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా 2005-06లో ఈ పాఠశాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఇవి ఏడు చోట్ల వున్నాయి. ఉత్తరాంధ్రలో విశాఖపట్నం, మన్యం జిల్లా సీతానగరం మండలం జోగింపేటలో ఈ పాఠశాల, కళాశాలలున్నాయి. ఈ పాఠశాల, కళాశాలలో అధ్యాపక సిబ్బంది నియామకం మిగిలిన పాఠశాల, కళాశాలలకు భిన్నంగా నిర్వహించాలని నిర్ణయించారు. ప్రత్యేక సెలక్షన్ కమిటీ ద్వారా మెరిట్ ఆధారంగా ఈ పాఠశాల, కళాశాలలకు ఎంపిక చేయాలనే నిబంధనలు ఉన్నాయి. అయినా రాజకీయ జోక్యం పెరగడంతో వీటి ప్రాధాన్యత కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వ హయాంలో సాధారణ బదిలీల్లో భాగంగా కడప బదిలీ అయిన ప్రిన్సిపల్ పి.వెంకటనాయుడ్ని డెప్యుటేషన్‌పై ఇక్కడ నియమించారు. గతంలో పని చేసిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సిఫార్సులతో ప్రతిభా పాఠశాలలో ఆయన నియామకం జరిగింది. ఆయన రెండేళ్ల పాటు ఇక్కడ ప్రిన్సిపల్‌గా పని చేశారు. ఇంటర్మీడియట్ విద్య, ఐఐటి, నీట్ పరీక్షలకు శిక్షణ వంటి అంశాలపై ఆయనకు కనీస అవగాహన లేకపోవడంతో ఆయన పని చేసిన రెండేళ్లలో ఒక్క విద్యార్థి కూడా ర్యాంకు సాధించలేదు. పైగా ఇంటర్ పరీక్షల్లోనూ ఉత్తీర్ణత శాతం తగ్గింది. అలాంటి ప్రిన్సిపల్ పి.వెంకటనాయుడ్ని ఐదు నెలల క్రితం అరుకు బదిలీ చేశారు. ఆయన బదిలీ అయినా ఇక్కడ పాఠశాలలో క్వార్టర్ ఖాళీ చేయడం లేదు. ఫలితంగా అరుకు నుంచి బదిలీపై వచ్చిన ప్రిన్సిపల్ ధర్మరాజు స్థానికంగా ఉండకుండా రోజూ రాకపోకలు చేస్తున్నారు.

గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల అంటే ప్రిన్సిపల్ స్థానికంగానే నివాసం వుండాలి. అయితే అలా జరగకుండా ఉండడానికి కారణం బదిలీ అయిన ప్రిన్సిపల్ వెంకట నాయుడు క్వార్టర్ ఖాళీ చేయకపోవడమేనని తెలుస్తోంది. అరుకులో ప్రిన్సిపల్‌గా ఉద్యోగం చేస్తూ జోగింపేటలో క్వార్టర్‌ను ఖాళీ చేయకుండా వెంకట నాయుడు చలామణీ అవుతున్నారు. దీనికి కారణం లేకపోలేదు. ఈ ప్రభుత్వంలోనూ తన పలుకుబడిని ఉపయోగించి మళ్లీ ఇక్కడికి డెప్యుటేషన్‌పై బదిలీ చేయించుకునే ప్రయత్నాల్లో ఆయన ఉన్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. గురుకుల ఉపాధ్యాయ సంఘాల నాయకుడినని చెప్పుకొంటున్న వెంకట నాయుడు తెరవెనుక పైరవీలు చేసి జోగింపేట ప్రతిభా పాఠశాల ప్రిన్సిపల్‌గా రావాలనే ఉద్దేశంతోనే ఇక్కడ క్వార్టర్ ఖాళీ చేయడం లేదని తెలుస్తోంది. ప్రతిభా పాఠశాల కళాశాలకు ప్రిన్సిపల్‌గా పని చేయడానికి అర్హత లేకపోయినా రాజకీయ సిఫార్సులతో నియమించడం పై గిరిజన సంఘాలు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.





గుమ్మలక్ష్మీపురంలో ఏచూరికి నివాళ్లు అర్పిస్తున్న గిరిజన సంఘం నాయకులు, ఉద్యోగులు ; పాలకొండలో నివాళ్లు అర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పేదల సమస్యలపై పోరాడిన ఏచూరి

ప్రజాశక్తి - పాలకొండ

పేదల సమస్యలపై నిరంతరం రాజీలేని పోరాటం చేసిన మేధావి సీతారాం ఏచూరి అని సిపిఎం మండల కార్యదర్శి దావాల రమణారావు కొనియాడారు. మండలంలోని వెలగవాడ పంచాయతీ సిరికొండలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి సంతాపం తెలుపుతూ ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళ్లు అర్పించారు. అనంతరం రమణారావు మాట్లాడుతూ ఏచూరి మరణం సిపిఎంకు తీవ్ర లోటని ఇలాంటి సందర్భంలో ఆయన ఆశయాల సాధన దిశగా అన్ని వర్గాల ప్రజలు పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఆ విధంగా పోరాటం చేసి సమస్యలు పరిష్కరించుకోవడమే ఆయనకిచ్చిన నిజమైన ఘన నివాళి తెలిపారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఎస్.గంగయ్య, దూసి దుర్గారావు, కాద రాము, ఎస్.రామరాజు, ఎస్.బుడ్డయ్య, ఎస్.రమేష్, సోగన్న, ఎస్.అనూష, ఎస్.ఆదమ్మ, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : విద్యార్థి దశ నుంచే పోరాటమే తన ఊపిరిగా బతికి శ్రామిక వర్గాల హక్కులకై ఎత్తిన పిడికిలి దించకుండా పోరాడిన యోధుడు, కమ్యూనిస్టు వీరుడు సీతారాం ఏచూరి అని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు తోట రమేష్ అన్నారు. స్థానిక వైటిసిలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఆయన ఆశయాలు, ఉద్యమాలు బడుగు, బలహీన, శ్రామిక వర్గాల ప్రజల్లో చిరస్థాయిగా మిగిలిపోతాయని పేర్కొన్నారు. ఒక ఉద్యమ ధ్రువతారను సిపిఎం కోల్పోయిందని అన్నారు. ఒక కమ్యూనిస్టు నేతగా ఆయన సేవలు ఎనలేనివని మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మండంగి రమణ, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కూర్మారావు, నాయకులు ప్రసాద్ , చలపతి, కరువులు, రవి తదితరులు ఉన్నారు.

నేడు పాలకొండలో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - పాలకొండ

ఈనెల 17న పాలకొండలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా పది, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్ , ఎంఎస్సీ విద్యార్హతలు కలిగి, 18 నుండి 30 ఏళ్ల వయస్సు గల యువతీ, యువకులు అర్హులన్నారు. జాబ్ మేళా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి పాలకొండ శ్రీ సత్య సాయి డిగ్రీ కళాశాలలో జరుగుతుందన్నారు. ఈ మెగా జాబ్ మేళకు 16 కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారని, 1050 పోస్టులు ఆయా కంపెనీలలో భర్తీ చేస్తున్నారని ఆయన తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరాలను skilluniverse.apssdc.in వెబ్ సైట్‌లో విధిగా నమోదు చేసుకోవాలని చెప్పారు. రిఫరెన్స్ నెంబర్‌తో పాటుగా రెస్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు, ఒరిజినల్ జెరాక్స్, ఒక పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో ఉదయం 9 గంటలకు జాబ్ మేళా జరుగు ప్రదేశంలో హాజరు కావాలన్నారు. వివరాలకు 6301275511, 7993795796 ఫోన్ నెంబర్లకు సంప్రదించవచ్చని తెలిపారు.



వందేభారత్ రైలుకు స్వాగతం పలుకుతున్న కేంద్రమంత్రి రామ్మోహననాయుడు, ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్‌పి

పార్వతీపురం చేరుకున్న వందేభారత్

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

విశాఖ-దుర్గ్ మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సోమవారం విశాఖలో ప్రారంభించగా, పార్వతీపురం చేరుకుంది. దీంతో పెద్ద ఎత్తున కూటమి నాయకులు పెద్ద ఎత్తున రైల్వే స్టేషన్‌కు చేరుకుని స్వాగతం పలికారు. మొదటిసారి పార్వతీపురం వచ్చిన వందేభారత్‌ను చూసేందుకు స్థానికులు తరలివచ్చారు. విశాఖ నుంచి ఈ రైలులో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, స్థానిక ఎమ్మెల్యే విజయచంద్ర పార్వతీపురం చేరుకున్నారు. ఈ సందర్భంగా డివిజనల్ రైల్వే అధికారులు ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాను అన్ని విధాల అభివృద్ధి చేస్తామని, వందేభారత్ వంటి ప్రతిష్టాత్మక రైలు సౌకర్యం పార్వతీపురానికి కల్పించడం ద్వారా జిల్లా ప్రాధాన్యత రాష్ట్రంలో పెరిగిందని అన్నారు. రైల్వే జోన్ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయ, దీంతో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉందని అన్నారు. పార్వతీపురంలో హాల్టు సాధనకు ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర ఎంతో కృషి చేశారని కొనియాడారు. కొత్తగా ఏర్పడిన జిల్లాను కేంద్రం అన్ని విధాలా ఆదుకునేందుకు తన కృషి ఎప్పుడూ ఉంటుందన్నారు. ముందుగా తొలిసారిగా జిల్లాకు వచ్చిన కేంద్ర మంత్రిని కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, డిఆర్ఒ సౌరబ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోలక లక్ష్మణమూర్తి

గుమ్మలక్ష్మీపురంలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీ ప్రాంతానికి కేంద్ర బిందువుగా ఉన్న గుమ్మలక్ష్మీపురంలో ఐటిడిఎ ఏర్పాటు చేసి గిరిజన అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక చైర్మన్ కోలక లక్ష్మణమూర్తి కోరారు. సోమవారం స్థానిక వైటిసిలో గిరిజన నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. గిరిజన అభివృద్ధి, సంక్షేమం కోసం ఏర్పడిన ఐటిడిఎ మైదాన ప్రాంతంలో ఉండడంతో గిరిజనులకు సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయని అన్నారు. దీంతో నేటికీ గిరిజన అభివృద్ధి ఇంకా వెనుకబాటుగానే ఉందన్నారు. రోజురోజుకు ఐటిడిఎ నిర్వీర్యమయ్యే దిశగా అడుగులు పడుతున్నాయే తప్ప ఏ మాత్రం రక్షణ చర్యలు కానరావడం లేదన్నారు. గిరిజన అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఐటిడిఎను మన్యం ప్రాంతమైన గుమ్మలక్ష్మీపురంలో ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అప్పుడే గిరిజనులకు సంక్షేమ పథకాలు, రుణాలు, ఉద్యోగ ఉపాధి కల్పన అవకాశాలు అందే అవకాశం ఉంటుందన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి మండంగి రమణ మాట్లాడుతూ ఆనాడు ఉద్యమ పోరాటాల ఫలితంగా గిరిజన అభివృద్ధి కోసం ఏర్పడిన ఐటిడిఎ నేడు ఆలనా పాలన లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నూటికి నూరు శాతం గిరిజనులు ఉన్న గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో ఐటిడిఎను ఏర్పాటు చేసి గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. అప్పుడే ఐటిడిఎ పటిష్టంగా ఉండడంతో పాటు పరిపాలన విధానం కూడా సక్రమంగా జరుగుతుందని అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో ఐటిడిఎ ఏర్పాటు చేసేంత వరకు గిరిజనులంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు తోట రమేష్, గిరిజన సంఘం నాయకులు సన్యాసిరావు, గుమ్మలక్ష్మీపురం సర్పంచి బొత్తాడ గౌరీ శంకర్రావు పలువురు గిరిజన నాయకులు ఉన్నారు.

మహిళా ఎంపిటిసిపై

టిడిపి నాయకుల దాడి

మహిళని చూడకుండా పిడిగుద్దులు.. కులం పేరుతో దూషణ

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని మరిపల్లి ఎంపిటిసి సభ్యులు రామజన్ని సీతారాం (వైసిపి)పై అదే గ్రామానికి చెందిన టిడిపి నాయకులు దాడి చేసి గాయపర్చారు. దీంతో ఆమె స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో తనపై జరిగిన దాడిని వివరించారు. మరుపల్లిలో గణేశ్ నవరాత్రులు నిర్వహించి, ఆదివారం రాత్రి నిమజ్జనం చేశారు. ఇందులో బిసి, ఎస్‌టి, టిడిపి, వైసిపి వారున్నారన్నారు. ఈ సందర్భంగా యువకుల మధ్య గొడవ జరిగిందని అన్నారు. దీంతో తాను సర్ది చెప్పేందుకు వెళ్లగా, అప్పటికే తన మేనల్లుడు బోను వెంకటేష్‌ను టిడిపికి చెందిన కసినబోయిన వెంకట రమణ, మరికొందరు విచక్షణారహితంగా కొడుతున్నారన్నారు. తాను వారిని వారించబోతే అంతా కలిసి తనపై దాడి చేశారన్నారు. మహిళ అని చూడకుండా, అసభ్యపదజాలంతో, గిరిజన కులానికి చెందిన తనను, తన కుటుంబాన్ని కులం పేరుతో చెప్పుకోలేని విధంగా బూతులు తిడుతూ కొట్టారని అన్నారు. దీంతో కింద పడిపోయానని, అయినా వారు తన మెడలో ఉండే పుస్తెల తాడు, నల్ల పూసలను తెంపేసారన్నారు. తెంపిన వారు ఇవ్వాలని బతిమలాడినా ఇవ్వ లేదన్నారు. అర్ధరాత్రి వరకు విపరీతమైన నొప్పులతో బాధ పడుతూ సోమవారం చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరానన్నారు. తనపై కసినబోయిన వెంకట రమణ, సీతంనాయుడు, వినయ్, బోను కృష్ణ, బోను ఇందు తదితరులు దాడి చేశారన్నారు. వీరిపై పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు.

డిజె తెచ్చిన తంటా

రెండు వర్గాల మధ్య జరిగిన గొడవకు డిజె కారణంగా తెలుస్తోంది. గ్రామంలో ఉండే ఒకరు (మహిళ) గత కొన్నాళ్లుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారని, ఆదివారం సాయంత్రం వినాయక నిమజ్జనం సందర్భంగా నిర్వాహకులు డిజెను వినియోగించడంతో ఆమె పోలీసులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారని తెలిసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు వచ్చారని, అయితే ఈ విషయం వైసిపి వారే చేసి ఉంటారని నిర్వాహకులు భావించారని, అదే సమయంలో వీరు కాల్చిన మతాబులు వేరే మండపంలోకి దూసుకెళ్లి అందులో నిద్రిస్తున్న వారిపై పడ్డాయని, దీంతో వారొచ్చి అడగ్గా ఘర్షణ మొదలై, కొట్లాటకు దారి తీసిందని తెలిసింది. ఇదిఇలా ఉండగా అసలు డిజెకు అనుమతి ఎవరిచ్చారు, దీనికి అనుమతులు ఉన్నాయా, లేకుండా వినియోగించారా, పోలీసుల పాత్ర ఏమిటన్నది ప్రశ్నార్థకంగా ఉంది. దీనిపై రూరల్ సిఐ రామకష్ణ దర్యాప్తు చేసి, తగిన చర్యలు తీసుకోవల్సి ఉంది. అలాగే ఇకపై డీజేలు వినియోగించ కుండా చర్యలు చేపట్టాల్సి ఉంది.



కురుపాంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిములు

ఘనంగా ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలు

ప్రజాశక్తి - కురుపాం

ఈద్ మిలాద్ ఉన్ నబీ పండగను పురస్కరించుకొని ముస్లిం సోదరులు మండల కేంద్రంలో గల శివన్నపేట జామీయ మసీదు వద్ద సోమవారం మత గురువు ఇమామ్ సర్దార్ ఆలంఖాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర, జీవన శైలి గురించి వివరించారు. ఆయన జన్మదినం నాడే పండగను జరుపుకోవడానికి గల ఆవశ్యకత గూర్చి వివరించారు. అనంతరం శివన్నపేట మసీదు నుంచి కురుపాంలో గల గాంధీనగర్ జంక్షన్ వరకు ముస్లిం సోదరుల కుటుంబ సభ్యులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు షేక్ గౌస్, షేక్ జిలాని, షేక్ నిసార్, షేక్ నూరేళ్ళ, షేక్ ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్: ఈద్ మిలాదిన్ నబీ పర్వదినం సందర్భంగా సోమవారం ముస్లిం లు పట్టణ ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. మతపెద్ద షేక్ ఇక్బాల్ ఆధ్వర్యాన ముస్లింలు పెద్ద సంఖ్యలో నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. కోట వీధి నుంచి పెదకోమటి పేట, డబ్బివీధి, దండిగాం రోడ్ మీదుగా ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు.

స్కూల్ కాంప్లెక్సుల విభజనలో శాస్త్రీయత కరువు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

విద్యాశాఖ ఆదేశాల మేరకు చేస్తున్న స్కూల్ కాంప్లెక్స్‌ల విభజనలో శాస్త్రీయత లోపించిందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. జాతీయ విద్యా విధానం 20-20లో భాగంగా పాఠశాల రేషనైజేషన్ చేస్తున్నారని, భవిష్యత్తులో సిఆర్‌పిల సంఖ్యను తగ్గించడానికి ఎంఇఒ పోస్టులను రద్దు చేయడానికి కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రపంచ బ్యాంకు ఒప్పందం మేరకు ఈ పునర్విభజన జరుగుతుందని ఆరోపించారు. ఇప్పటికే స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు ప్రాథమిక పాఠశాలలు పర్యవేక్షణ, హైస్కూల్ పర్యవేక్షణ కష్టమవుతుందన్నారు. స్కూల్ కాంప్లెక్స్‌లు సగానికి తగ్గించడం అంటే ప్రధానోపాధ్యాయులకు ఇంకా భారమవుతుందని, దీంతో విద్యారంగం పెనం మీద నుండి పొయ్యి మీదకు పడే అవకాశం ఉందని అన్నారు. కొన్ని మండలాల్లో ఎంఇఒ ఒకటి, రెండు కిలోమీటర్ల పరిధిలోనే మూడు స్కూలు కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేశారని, ఇది సరికాదని అన్నారు. కావున సంఘాలతో చర్చించి పునర్విభజన చేయాలని డిమాండ్ చేశారు.

మెగా వైద్య శిబిరాన్ని విజయవంతం చేయండి

కురుపాం : స్థానిక కోటలో మంగళవారం నిర్వహించ చనున్న మెగా వైద్యశిబిరాన్ని నియోజకవర్గం లో ఐదు మండలాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయా లని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ కోరారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరానికి విజయనగరం మిమ్స్ ఆసుపత్రి నుంచి ఆప్తాలమిక్, గైనిక్, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్, ఆర్థో వైద్య నిపుణులు రానున్నారని, ఈ అవకాశాన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే మెగా రక్తదాన శిబిరంలో యువత పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలు గా నిలువాలని సూచించారు.


ఎమ్మెల్యేకు నగదును అందజేస్తున్న కొమరాడ మండల నాయకులు

వరద బాధితులకు రూ.3 లక్షలు సాయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విజయవాడ వరద బాధితులకు వివిధ పార్టీల నాయకులు, ప్రజలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఇందులో భాగంగానే కొమరాడ మండలంలోని కూటమి నాయకులు, ప్రజలు సోమవారం గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చి ఎమ్మెల్యే జగదీశ్వరికి రూ.3 లక్షలు నగదు అందించారు. వరద బాధితుల సహాయార్థం ప్రతి మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజలు ప్రతి ఒక్కరూ తమకు తోచిన సాయం చేస్తూ అండగా నిలవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కొమరాడ మండల టిడిపి అధ్యక్షులు శేఖర్ పాత్రుడు, జనసేన జిల్లా కార్యదర్శి గారి గౌరీ శంకర్, నాయకులు పొట్నూరు వెంకటనాయుడు, అనంత, వాన ఉపేంద్ర, తెంటు శేఖర్, మండల జనసేన అధ్యక్షులు అధికారి సుజాత, తదితరులు ఉన్నారు.


స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

స్పోర్ట్స్ మీట్‌లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - సీతంపేట

ఈ నెల 14,15 తేదీల్లో విజయవాడ లో నిర్వహించిన గేమ్స్, స్పోర్ట్స్ మీట్లో స్థానిక అల్లూరి సీతారామరాజు ఒకేషనల్ జూనియర్ కళాశాల - ఇంటర్మీడియట్ విద్యార్థినిలు ప్రతిభ కనబర్చారు. ఖోఖోలో ద్వితీయ స్థానం, 800 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న కొండగొర్రి నవ్య ప్రథమ స్థానంలో నిలిచి బంగారుపతకం మెడల్ కైవసం చేసుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ జి.గోవిందరావు విద్యార్థులను అభినందించారు

యోగాసన పోటీల్లో మూడోస్థానం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బూర్జ ఆయుర్వేద ఆసుపత్రి ఆయుష్ హెల్త్, వెల్నెస్‌లో యోగా శిక్షకులుగా పనిచేస్తున్న ఎం.రూపవతి రాష్ట్ర స్థాయి యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్షిప్‌లో మూడవ స్థానం కైవసం చేసుకున్నారని ఆయుష్ వైద్యులు డాక్టర్ టి.హేమాక్షి తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమాక్షి మాట్లాడుతూ బూర్జ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో రెండేళ్ల క్రితం ఆయుష్ హెల్త్ వెల్నెస్ కేంద్రం ప్రారంభమైందని యోగా శిక్షకులుగా ఆమె నియామకం జరిగింది. ఇప్పటికే ఆ పరిధిలో పలు గ్రామాల్లో డాక్టర్ హేమాక్షి ఆధ్వర్యంలో యోగా శిక్షణలు, సూచనలు, ఆయుష్ వైద్య శిబిరాలు నిర్వహించామని, అనేక దీర్ఘకాలిక రోగాలకు, మానసిక ఒత్తిడికి ఆయుర్వేదం, యోగా మంచి చికిత్స అని ఆమె తెలిపారు. ప్రజల్లో వీటిపై మరింత అవగాహన పెంపొందిస్తున్నట్టు తెలిపారు.

18న రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక వైటిసి భవనంలో ఈనెల 18న మేము సైతం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు ఎంపిడిఒ కె.గీతాంజలి ఒక ప్రకటనలో తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, కేంద్ర, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాలు, నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న "మేము సైతం" రక్తదాన శిబిరంలో ఆసక్తి ఉన్నవారు ముందుకు రావాలని ఆమె కోరారు.

నేడు ఆటల పోటీలు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని అన్ని యాజమాన్య పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులకు మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలు బాలురులకు మాత్రమే స్థానిక ప్రభుత్వ గిరిజన బాలురు ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ జాకబ్ దయానంద్ తెలిపారు. ఈ క్రీడలకు బాలుర పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులతో తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. పాఠశాలలో క్రీడాకారులను ఎంపిక చేసి తీసుకురావాలని దయానంద్ తెలిపారు.

ఐటిడిఎ పోస్టులు భర్తీ చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం ఐటిడిఎలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐటిడిఎ పిఒ, మేనేజర్, ఎఒ, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డెప్యూటీ డిఎంహెచ్ఒ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పై పోస్టులు వెంటనే భర్తీ చేసి ఐటిడిఎ పాలన సక్రమంగా సాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.


సిఐ హరిని కలిసిన మండల సర్పంచులు

సిఐని కలిసిన సర్పంచులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎల్విన్‌పేట సిఐ హరిని మండలంలోని పలు పంచాయతీల సర్పంచ్‌లు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వినాయక చవితి ఉత్సవాలు విజయవంతమయ్యేలా సహకరించినందుకు సిఐకు ధన్యవాదాలు తెలిపారు. తమ పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలు, పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్ పేట, లక్క గూడ, కొండవాడ, ఇరిడి, వంగర, నెల్లికిక్కువ, సిహెచ్.బిన్నిడి, వనకాబడి, చిన్న గీసాడ, బాలేసు, రాయగడజమ్ము సర్పంచులు ఉన్నారు.

ఒప్పంద కార్మికులపై వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లాలో వైద్య విభాగంలో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలని, కార్మికులపై వేధింపులు ఆపాలని ఎపి మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అర్ వి ఎస్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జిల్లా ఆసుపత్రి వైద్య విభాగ ఒప్పంద కార్మికుల అధ్వర్యంలో కార్మికులంతా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ కార్మికులకు గుత్తేదారులు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదన్నారు. దీనిపై తక్షణం ప్రభుత్వం స్పందించి ఒప్పంద కార్మికులకు సంబంధించి గుత్తేదారు వ్యవస్థను రద్దు చేయాలని, పురపాలక కార్మికుల తరహాలో ఆప్కాస్‌లో కలపాలని కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు దుర్గారావు, కుమారమ్మ, చంద్రమౌళి, కావ్య, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు..

శిథిలావస్థలో ఆరోగ్య కేంద్రాలు

అంతంతమాత్రంగా వైద్యసేవలు

నిర్మాణాలు పూర్తయినా ప్రారంభానికి నోచని పిహెచ్‌సిలు

ప్రజాశక్తి - సాలూరు రూరల్/ వీరఘట్టం

ప్రజారోగ్యమే ప్రధానమని పాలకులు, అధికారులు ప్రచారం చేస్తున్నప్పటికీ ఆచరణలో మాత్రం అంతంతమాత్రమేనన్న విమర్శలు సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే ఆసుపత్రికి వచ్చే రోగికి వైద్యమందించేందుకు జిల్లాలోని పలుచోట్ల పిహెచ్‌సిలకు పక్కా భవనాల్లేవు. కొన్ని చోట్ల నిర్మాణాలు పూర్తయినా ప్రారంభానికి నోచుకోకపోగా, మరికొన్ని చోట్ల శిథిలమైన భవనంలోనే బిక్కుబిక్కుమంటూ వైద్యులు రోగులకు వైద్యసేవలందిస్తున్నాయి. ఒకవైపున ఉన్నతాధికారులు, పాలకులు రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని ఆదేశిస్తున్నారు. అయితే ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించకుండా రోగులకు మెరుగైన సేవలు అందిస్తామని వైద్యులు ప్రశ్నిస్తున్నారు.

సాలూరు మండలంలో తోణాం, మామిడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కొత్త భవనాలు మంజూరయ్యాయి. వైసిపి ప్రభుత్వ హయాంలో నాలుగేళ్ల క్రితం వీటి నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నాయి. అయితే కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో స్థానిక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ పిహెచ్‌సిలకు సుదూర ప్రాంతాలకు చెందిన గిరిజనులు వైద్యం కోసం వస్తుంటారు. మళ్లీ వీరు ఇళ్లకు చేరడానికి సాయంత్రమైపోతుంది. రవాణా సౌకర్యం లేక ఆసుపత్రిలోనే ఉండి పోతుంటారు. ప్రస్తుతం ఉన్న భవనం పాతది, ఇరుగ్గా ఉండటంతో వారు ఆరుబయటనే నిరీక్షించాల్సిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ పిహెచ్‌సి రూ.కోటి 80లక్షలతో పనులను ప్రారంభించేందుకు గత ప్రభుత్వంలో ఆమోదించింది. నిర్మాణం పూర్తయిన ప్రారంభానికి నోచుకోలేదు. సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లును చెల్లించపోవడం భవనం అప్పగించలేదు.


శిథిలావస్థకు చేరిన వీరఘట్టం పిహెచ్‌సి అదనపు భవనం

మామిడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సువర్ణముఖి నది పక్కనే ఉంది. ఈ నది ఉధృతంగా ప్రవహించడంతో కింద ఉన్న ఆసుపత్రిలోకి వరదనీరు చేరుతుంది. దీంతో హాస్పిటల్‌లో ఉండే రోగులు, సిబ్బంది భయంతో బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తుంది. తుఫాన్ల సమయంలో ఆసుపత్రిలోఉన్న గర్భిణులు కూడా అవస్థలుపడుతున్నారు. గతంలో హుదూద్, గులాబ్ తుఫాన్లకు ఈ పిహెచ్‌సి పూర్తిగా ముంపునకు గురైంది. దీంతో ఆసుపత్రిలో ఉన్న చాలా వరకు విలువైన సామగ్రి పాడైపోయాయి. ఇక్కడ ఆస్పత్రి ప్రారంభించి నాలుగేళ్లు కావస్తున్నా నేటికీ పూర్తి కాకపోవడంతో ఇక్కడికి వచ్చే రోగులు, పనిచేసే వైద్య సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ పిహెచ్‌సికి సుమారు రూ.కోటి


మధ్యలో నిలిచిపోయిన మామిడిపల్లి పిహెచ్‌సి

80లక్షలు మంజూరైనా, కాంట్రాక్టరుకు ఇంకా పెండింగ్ బిల్లులు మంజూరు చేయలేదు. దీంతో కాంట్రాక్టరు పనులు చేసేందుకు ముందుకు రాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బిల్లులు మంజూరు చేసి హాస్పటల్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి వైద్యసేవలందించాలని స్థానికులు కోరుతున్నారు.

శిథిలావస్థలో అదనపు భవనం

వీరఘట్టం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమీపంలో ఉన్న అదనపు భవనం కూలేందుకు సిద్ధంగా ఉంది. ఉన్న ఆరు పడకల ఆసుపత్రి పనులు చేపట్టినప్పుడు అప్పట్లో ఈ భవనాన్ని వినియోగించేవారు. ఆరు పడకు ఆస్పత్రి వినియోగంలోనికి రావడంతో ఈ భవనాన్ని పూర్తిగా పట్టించుకోవడం మానివేయడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకొంది. కొద్దిరోజుల వరకు ఇదే భవనంలో ఆశా కార్యకర్తలు, సెక్టార్ సమావేశాలతో పాటు ఇతర సమావేశాలు కూడా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ భవనం శ్లాబ్ పెచ్చులు ఊడి పడిపోవడం, గోడలు కూడా బీటలు వారడంతో చిన్నపాటి చినుకు పడ్డా స్లాబ్ పైనుంచి నీరు కిందకు దిగడంతో ఇందులో సమావేశాలు పెట్టుకునేందుకు అధికారులు భయమందోళనకు గురవుతున్నారు. ఈ శిథిలమైన భవనంలో 108 సిబ్బంది కూడా విశ్రాంతి పొందుతున్నారు. ప్రమాదమని తెలిసి కూడా ఏ ఆధారమూ లేకపోవడంతో శిథిలమైన భవనంలోనే కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని 108 నిర్వాహకులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అదనపు భవనానికి మరమ్మతులు చేసి రోగులకు, వైద్యులకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి నుంచి జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛతా హీ సేవ

ప్రజాశక్తి - పార్వతీపురం

స్వచ్ఛ భారత్ దినోత్సవం సందర్భంగా మంగళవారం నుంచి అక్టోబర్ 2 వరకు జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛతా హి సేవ నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వచ్ఛభారత్ మిషన్ పదో వార్షికోత్సవం, స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం ఏడు వసంతాలు పూర్తి చేసుకున్న తరుణంలో ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచి పోతుందన్నారు. ఇందులో భాగంగా జిల్లా అంతటా పరిశుభ్రతకు సంబంధించిన కార్యకలాపాల్లో సమష్టి కార్యాచరణ, పౌరులలో భాగస్వామ్య స్ఫూర్తిని పునరుద్ధరించడమే ధ్యేయంగా ముందడుగు వేయాలని ఆయన సూచించారు.

రోజువారీ కార్యక్రమాల వివరాలు

స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17న మానవహారం, పరిశుభ్రతపై మెగా డ్రైవ్, ఆరోగ్య సంరక్షణ సేవలు, 18న స్వచ్ఛత పరుగులు, బ్లీచింగ్, దోమల నివారణ మందులు పిచికారీ, నీరు నిలిచిపోయే ప్రదేశాలను శుభ్ర పరచడం, పారిశుధ్య కార్మికులకు ప్రథమ చికిత్స శిక్షణ, 19న ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో స్వచ్ఛత ప్రతిజ్ఞలు, డంప్‌ల గుర్తింపు తొలగింపు, పారిశుధ్య కార్మికులను గుర్తించి వారికి మంజూరైన పథకాలతో అనుసంధానం చేయాలన్నారు. 20న మొక్కల పెంపకం, 21న అవగాహన ప్రచారాలు, ర్యాలీలు, పరిశుభ్రత డ్రైవ్, పార్కులను శుభ్రపరచడం, నిర్వహణ, అభివృద్ధి, పిపిఇ కిట్లు, సేఫ్టీ గేర్లు పంపిణీ చేయాలని ఆయన సూచించారు. 22న మిషన్ లైఫ్ ప్రచారాలు, కాలువలు, డ్రైన్లను శుభ్రపరచడం, పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబాలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహణ, 23న వర్షపు నీటి నిల్వ, నిర్మాణాల నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు, రహదారుల శుభ్రత, 24న తాగునీటి నిర్మాణాల శుభ్రత, నిర్వహణపై అవగాహన ప్రచారాలు, నీటి నమూనాలను పరీక్షించడం, భద్రత, వ్యక్తిగత రక్షణపై సఫాయి మిత్రలు - వారి కుటుంబాలకు అవగాహన కార్యక్రమాలు ఉంటాయని ఆయన చెప్పారు . 25న వీధి నాటకాలు, మార్కెట్ ప్రాంతాలను శుభ్రపరచడం, 26న అవాంఛిత యాప్‌లను క్లియర్ చేయడం, సైబర్, డిజిటల్ స్వచ్ఛత, సంస్థాగత భవనాలు శుభ్రపరచడం, పిల్లల సంరక్షణ కార్యక్రమాలు చేపట్టాలని , 27న గ్రామ, వార్డు సభల నిర్వహణ, ప్రభుత్వ ఖాళీ స్థలాల సుందరీకరణ, టూరిస్ట్ పాయింట్లు, వీధుల పరిశుభ్రత డ్రైవ్‌లు, 28న సాలిడ్ వేస్ట్ మెనేజ్మెంట్ ఆస్తుల సుందరీకరణ, పునర్వినియోగానికి పనికొచ్చే ఇ-వ్యర్థాల సేకరణ, 29న చెత్తను సష్టించే ఆర్ట్ శానిటేషన్ పార్కులపై అవగాహన, 30న మూలాల విభజన, రీసైక్లింగ్ పద్ధతులు, కంపోస్టింగ్‌పై ప్రదర్శనలు, కమ్యూనిటీ బేస్డ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అవగాహన డ్రైవ్‌లు, ఆరోగ్య బీమా నమోదులో సహకారం వంటి కార్యకలాపాలు చేయాలని, అక్టోబరు 1న విద్యా సంస్థల్లో స్వచ్ఛ హ్యాకథాన్ల నిర్వహణ, పబ్లిక్ టాయిలెట్స్ శుభ్రపరచడం, శానిటేషన్ కార్మికులు, ఇతరుల గుర్తింపు, సన్మాన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నుంచి అక్టోబర్ 2 వరకు మండలంలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలు జరగనున్నట్లు ఎంపిడిఒ అకిబ్‌జావేద్ సోమవారం తెలిపారు. మండలంలోని సంఘంవలసలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర చేతుల మీదుగా ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ఒక ప్రత్యేక కార్యాచరణ ద్వారా పారిశుధ్యం, సామాజిక అవగాహన కార్యక్రమాలు వివిధ దశల్లో జరుగుతాయని తెలిపారు.


గ్రామస్తులకు ఆరోగ్య సూచనలు చేస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ జగన్మోహనరావు

ఆరోగ్య పరిస్థితులపై పర్యవేక్షణ ఉండాలి

ప్రజాశక్తి - పాచిపెంట

ఏజెన్సీలో ప్రజల ఆరోగ్య పరిస్థితులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ టి.జగన్మోహనరావు ఆదేశించారు. డిపిఎంఒ డాక్టర్ రఘుకుమార్‌తో కలిసి మండలంలో మారుమూల గ్రామాలైన నీలంవలస, రాయిగుడ్డివలస, జిఎన్ పేట పిహెచ్‌సిలను సోమవారం సందర్శించారు. గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణ, సీజనల్ వ్యాధులపై సర్వే, స్ప్రేయింగ్ తదితర నివారణా చర్యల వివరాలపై సిబ్బందిని ఆరా తీసి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. హైరిస్క్ సమస్యతో ఉన్న గర్భిణులను ఏ విధంగా పర్యవేక్షిస్తున్నారు, అంగన్వాడీ కేంద్రం నుండి అందజేస్తున్న పౌష్టికాహారం, పిల్లలకు వేస్తున్న వ్యాధినిరోధక టీకా వివరాలపై ఆరా తీశారు. వెల్నెస్, ఆరోగ్య కేంద్రాలు అక్కడ గ్రామాలకు ఏమేర దూరంలో ఉన్నాయి వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో ఆరోగ్య కేంద్రాలకు రావడంలో ప్రయాసపడే మారుమూల గిరిజన ప్రాంత ప్రజల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది ఎక్కువ దృష్టి సారించాలని, అవసరమైన మందులు, పరీక్షలు వారికి అందుబాటులో ఉంచి వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ఫీడర్ అంబులెన్స్ సర్వీసులపై ఆరా తక్షణమే స్పందించాలని ఆదేశించారు. రహదారి సౌకర్యం లేని గ్రామాల్లో ఉండే గర్భిణీలను ప్రసవానికి ముందుగానే వసతి గృహంలో చేర్చాలని సూచించారు. వెల్నెస్ కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉంటూ మారుమూల గ్రామ ప్రజలకు సకాలంలో వైద్యం అందేలా చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం పిహెచ్‌సిలో రోగులకు ప్రతి రోజూ నిర్వహిస్తున్న ఆరోగ్య తనిఖీల వివరాలు రికార్డులో పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు అడిగి ఏ గ్రామాల నుంచి వచ్చారో తెలుసుకున్నారు. వార్డులో చికిత్స పొందుతున్న వృద్ధురాలి ఆరోగ్య స్థితిని పరిశీలించారు. ప్రతి రోజూ ఎంత మంది జ్వర పీడితులకు చికిత్స అందిస్తున్నారు, మందుల లభ్యతను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సుపర్వైజర్లు సిఎంసిఎస్ రెడ్డి, సంపత్ కుమార్, అంగన్వాడీ సూపర్వైజర్ ఇందిరాదేవి, వైద్య సిబ్బంది లక్ష్మి, నందిని, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించొద్దు

కొమరాడ : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరగకుండా సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ స్పందించాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అన్న పేరుగాంచిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను వెంటనే కూటమి ప్రభుత్వంలో ఉన్న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి స్పందించి ఉత్తరాంధ్రలో ఎంతోమందికి ఉపాధి కల్పించడంతో పాటు ఎంతోమంది ఆ రోజుల్లో ప్రాణ త్యాగం చేసి సాధించుకున్న విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే పేరుగాంచిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు కరణ చేసే దిశగా ఆలోచించే పరిస్థితి కనిపిస్తుందని అన్నారు. విశాఖ ఉక్కును మనమంతా కాపాడు కోవాలని, లేకుంటే భవిష్యత్తులో పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు రమణారావు

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - సీతంపేట

మధ్యాహ్నం భోజన కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయ ఆవరణంలో జరిగిన మధ్యాహ్నం భోజనం, కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ బడ్జెట్ పెంచాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని అన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రమాద బీమా వర్తింప చేయాలని కోరారు. రాజకీయ జోక్యం అరికట్టాలని, వంట కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎపి మధ్యాహ్నం భోజనం కార్మిక సంఘం సీతంపేట మండలం అధ్యక్ష కార్యదర్శులు ఎన్.రొయ్యబారి, బిడ్డిక ఉష, మండలంలో గల వంట కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎవరైనా ఆపదలో ఉన్నారంటే చాలు ఆర్థిక సాయం చేసి ఆదుకోవడంలో ముందుంటారు గుమ్మలక్ష్మీపురం ప్రజలు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ కాలనీలోని ప్రకాష్ మేస్త్రి అనారోగ్యంతో ఇటీవల మరణం చెందారు. నిరుపేద కుటుంబం కావడంతో వారి ఆర్థిక పరిస్థితిని గమనించి హెల్పింగ్ హాండ్స్, గ్రామదేవత గ్రూపుల దాతలు రూ.15వేలు సర్పంచి బి. గౌరీశంకర్ చేతులు మీదుగా విరాళాలు అందించారు. మరోవైపు బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతూ విశాఖ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న శృంగవరపు వీధికి చెందిన సవర కొండలరావుకు హెల్పింగ్ హాండ్స్, కాపు సంఘం ఆధ్వర్యంలో రూ.31 వేలు ఆర్థిక సహాయం చేశారు.


మేస్త్రి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న హెల్పింగ్ హేండ్స్ సభ్యులు

సొంపిగాం వద్ద వంతెన నిర్మించాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని సొంపిగాం వద్ద వంతెన నిర్మించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల సిపిఎం కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ వంతెన నిర్మాణానికి రూ.3కోట్ల 37లక్షలతో గత ప్రభుత్వం 2022లో మంజూరు చేసిందని, 2024 నాటికి నిర్మాణం చేయాల్సి ఉన్నా ఇప్పటికీ పూర్తి కాక మధ్యలో నిలిచిపోయిందని అన్నారు. ఇటీవల కాలంలో కురిసిన భారీ వర్షాలకు నడక దారి కొట్టుకు పోయిందని, దీంతో రాకపోకలు నిలిచిపోయాయని అన్నారు. కావున అగిపోయిన వంతెన నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు చింత జోగయ్య, సీనియర్ నాయకులు సుకురు గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

భద్రగిరి డిఇ, ఎఇ పోస్టులు భర్తీ ఎప్పుడో?

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని భద్రగిరి గిరిజన సంక్షేమ శాఖ ఐటిడిఎ ఇంజనీరింగ్ కార్యాలయ విభాగంలో పనిచేస్తూ అవినీతి ఆరోపణలపై సస్పెండ్ అయిన డిఇ, ఎఇ పోస్టులు స్థానంలో కొత్త వారిని నేటికీ ప్రభుత్వం భర్తీ చేయలేదు. పై ఇద్దరు అధికారులు సస్పెండ్ అయి 27 రోజులు కావస్తున్నా నేటికీ కొత్తవారిని నియమించకపోవడంతో ఏజెన్సీలో జరగాల్సిన అభివృద్ధి పనులు అంతంత మాత్రమే జరుగుతున్నాయి. ప్రస్తుతం భద్రగిరి ఐటిడిఎకు కర్త, కర్మ, క్రియ లాగా ఒక్క ఎఇ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మండలంలోని పూర్తి పని భారమంతా ఒక్క ఎఇపైనే ఉండడంతో ఇబ్బందిగా మారింది. రోడ్లు, భవనాలు, సెల్ టవర్ల నిర్మాణ ప్రతిపాదన చర్యలు వంటి అభివృద్ధి పనులు వేగవంతంగా జరగాలంటే డిఇ, ఎఇలను నియమించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని గిరిజన సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని రేగిడిలో మీకు తెలుసా ప్రోగ్రాం వైడిఒ అవుట్ రీచ్ వర్కర్ అడ్డాకుల గీతా రాణి ఆధ్వర్యంలో యువతకు, ప్రజలకు హెచ్ఐవి /ఎయిడ్స్, సుఖ వ్యాధులపై అవగాహన నిర్వహించారు. కండోమ్ ప్రమోషన్, సేఫ్ సెక్స్, బిహేవియర్ వంటి అంశాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో రేగిడి పిహెచ్‌సి హెల్త్ సూపర్‌వైజర్ రమణ, రాజేశ్వరి, సిహెచ్‌డబ్ల్యూఒలు ఉన్నారు.

నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రభుత్వ నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి రవికుమార్ అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న విద్యాసంస్థలను తక్షణమే సీజ్ చేయాలని, విద్యా సంస్థల యాజమాన్యం అవలంబిస్తున్న విధానాల వల్ల విద్యార్థులు ఎంతగానో మానసిక ఒత్తిడి గురవుతున్నారని, వారికి స్వేచ్ఛ లేకుండా చేస్తున్నారన్నారు. ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో పెద్దఎత్తున ఆందోళనకు చేపట్టామని హెచ్చరించారు.

పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు మృతి



ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కాశీపేటకు చెందిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పిఎసిఎస్) మాజీ అధ్యక్షులు తేలు అన్నపూర్ణమ్మ సోమవారం మృతి చెందారు. మాజీ జెడ్‌పిటిసి తెంటు వెంకట అప్పలనాయుడుకు ఈమె అత్త. అన్నపూర్ణమ్మ మృతి పట్ల వివిధ పార్టీల చెందిన నాయకులు సంతాపం వ్యక్తం చేశారు..

'వందే భారత్'కు బొబ్బిలిలో హాల్ట్ కల్పించాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

దుర్గ్ నుంచి విశాఖపట్నంకు నూతనంగా నడుస్తున్న వందే భారత్ రైలుకు బొబ్బిలిలో హాల్ట్ కల్పించాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడును ఎమ్మెల్యే బేబినాయన కోరారు. కేంద్ర మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం రామ్మోహన్ నాయుడును బేబినాయన కలిసి వినతిపత్రం అందజేశారు. బొబ్బిలి రైల్వే స్టేషన్ ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉంటుందని, రైల్వేకు అత్యధికంగా ఆదాయం వస్తుందని చెప్పారు. నిత్యం రద్దీగా ఉన్న రైల్వే స్టేషన్‌లో వందే భారత్ రైలుకు హాల్ట్ లేకపోవడంతో ప్రయాణికులు అసంతృప్తితో ఉన్నారని, హాల్ట్ కల్పించేలా చూడాలని కోరారు. రైల్వే శాఖ మంత్రి, అధికారులతో మాట్లాడి హాల్ట్ కల్పించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆయనతో టిడిపి నాయకులు ఎస్.ఈశ్వరరావు, ప్రసాద్, నాయకులు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

చెరువులో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని నర్సిపురం కోనేరులో ప్రమాదవశాత్తూ కాలుజారి యువకులు పడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వైకెఎం కాలనీకి చెందిన కునుకు రాంప్రసాద్ (30) గత కొన్నేళ్లుగా తల్లిదండ్రులతో కలిసి కాలనీలోనే కాపురం ఉంటూ, బైక్ మెకానిక్ గా జీవనోపాధి కొనసాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి నర్సిపురంలో జరిగిన గణేష్ నిమజ్జనంలో పాల్గొన్న అనంతరం అందరూ తిరిగి రాగా, మృతుడు ఇంటికి రాకపోవడంతో ఉదయం పలుచోట్ల గాలించారు. సోమవారం మధ్యాహ్నం కోనేరులో శవమై తేలి కనిపించడంతో, ప్రమాదవశాత్తు కాలుజారి పడినట్లుగా కుటుంబీకులు, బంధువులు భావిస్తున్నారు. మృతునికి భార్య ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ పోషణకు ఆధారమైన కొడుకు మరణించడంతో తల్లిదండ్రులు త్రినాధ, సత్యవతమ్మ తీవ్రంగా రోధిస్తున్నారు.

మూడున్నర తులాల బంగారం చోరీ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిట్టపూడివలసకు చెందిన యామక గౌరమ్మకు చెందిన మూడున్నర తులాల బంగారాన్ని సోమవారం గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి మెడలోని బంగారాన్ని తెంచి అపహరించుకుపోయినట్లు ఆమె తెలిపారు. ఈమె వ్యవసాయ శాఖలో ఎన్ఎఫ్‌జెడ్‌గా విధులు నిర్వహిస్తూ పంట పొలాల్లో ఉన్న రైతులకు సలహాలు ఇచ్చేందుకు ఇంటి నుంచి వస్తుండగా మార్గమధ్యలో గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనంపై తనను వెంబడించి మెడలో బంగారం తెంచి వేయడంతో తను పడిపోయింది. వెంటనే తేరుకొని దొంగను పట్టుకునేందుకు సాహసించినప్పటికీ ఆ వ్యక్తి తక్షణమే ద్విచక్ర వాహనం పట్టుకుని పరారయ్యాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానిక ఎస్ఐ జి.కళాధర్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కడకల్లా కిమ్మి వైపు కూడా పరిశీలించి, అక్కడ దేవాలయంలో గల సిసి ఫుటేజ్‌లు పరిశీలించినట్టు ఆయన తెలిపారు. గౌరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.